క్లుప్తంగా

వైద్య శిబిరం విజయవంతం



బీపీ పరీక్షిస్తున్న సిబ్బంది

చీమకుర్తి రూరల్: మండలంలోని ఆర్ఎల్ పురం పంచాయతీలో గురువారం కిమ్స్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో శ్రీ కార్తికేయ పాలి క్లినిక్ డాక్టర్ శివ కృష్ణ సహకారంతో వైద్య శిబిరం నిర్వహించారు. 160 మంది రోగులకు ఈసీజీ, షుగర్, బీపీ పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేసినట్లు క్యాంప్ కోర్డినేటర్ రత్న కుమార్ తెలియ చేశారు. ఆర్థోపెడిక్ ఉదయ కుమార్, స్త్రీల వైద్య నిపుణులు డాక్టర్ సుజని, డాక్టర్ రామాంజనేయులు సేవలు అందించారు.

సెమీ క్రిస్మస్ వేడుకలు రేపు

చీమకుర్తి రూరల్: మండల పాస్టర్స్ ఫెలోషిప్ ఐక్యతతో మంచికలపాడులో ఏసుక్రీస్తు ప్రార్థన మందిరంలో శనివారం సెమీ క్రిస్మస్ వేడుక నిర్వహించనున్నట్లు సంఘ కాపరి బ్రదర్ మాగులూరి పురుషోత్తం తెలిపారు. ఉదయం 10 గంటలకు, సాయంత్రం 6 గంటలకు వాక్యోపదేశకులు బ్రదర్ విక్టర్ దానియేల్ రెడ్డి చే ప్రసంగం ఉంటుందని, క్రైస్తవ సోదరులు, యవనస్తులు, విశ్వాసులు పాల్గొనాలని కోరారు.

కారు ఢీ.. వ్యక్తికి తీవ్ర గాయాలు



రామారావును అంబులెన్స్‌లో తీసుకు వెళుతున్న దృశ్యం

మద్దిపాడు: కారు ఢీకొని ఓ వ్యక్తికి తీవ్రమైన గాయాలు అయిన ఘటన మండలంలోని గుండ్లపల్లి గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. అన్నంగి గ్రామానికి చెందిన రామారావు అనే వ్యక్తి సిమెంట్ పైపులు కంపెనీలో పనిచేస్తున్నారు. ఫ్యాక్టరీ నుంచి గుండ్లాపల్లి వైపు మోటార్ బైక్ పై ప్రయాణిస్తుండగా వ్యతిరేక దిశలో వస్తున్న కారు అతన్ని ఢీకొట్టింది. దీంతో రామారావుకు ఎడమవైపు తొడ చీలి.. ఎడమ చేతి మణికట్టు వద్ద ఎముకలు విరిగిపోయాయి. స్థానికుల ద్వారాసమాచారం అందుకున్న 108 సిబ్బంది అతనిని ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. మెరుగైన వైద్యం కోసం రామారావును ప్రైవేట్ హాస్పిటల్ కి తరలించినట్లు సమాచారం.

భజరంగ్‌దళ్ కార్యకర్తలను అరెస్ట్ చేయాలి



నిరసన తెలుపుతున్న నాయకులు

ఒంగోలు వన్‌టౌన్: తిరుపతిలో దళిత ప్రొఫెసర్ చెంగయ్యపై దాడి చేసిన భజరంగ్ దళ్ కార్యకర్తలను అరెస్టు చేయాలని దళిత పాస్టర్స్ ప్రొటెక్షన్ ఫోర్స్ కమిటీ డిమాండ్ చేసింది. ఒంగోలు అంబేడ్కర్ భవన్‌లో గురువారం నిరసన వ్యక్తం చేశారు. తిరుపతి ఎస్వీ యూనివర్సిటీలోని ప్రొఫెసర్ చెంగయ్య పై భజరంగ్ దళ్ కార్యకర్తలు దాడిచేసి, ఆయన కారును ధ్వంసం చేశారన్నారు. పాస్టర్లపై దాడులు జరిగితే ప్రభుత్వం స్పందించడంలేదన్నారు. పాస్టర్లు ఇమ్మానుయేల్, అబ్రహం, జక్రయ్య, జాషువా, దళిత సంఘాల నాయకులు చప్పిడి రవి శంకర్, రమేష్, జయ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయం తనిఖీ



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీఓ రాఘవేంద్ర

చీమకుర్తి రూరల్: మండలంలోని బండ్లమూడి తొర్రగుడిపాడు సచివాలయాలను ఎంపీడీఓ రాఘవేంద్ర గురువారం ఆకస్మికంగా సందర్శించారు. హాజరు పట్టి పరిశీలించి.. సిబ్బంది సమయానికి హాజరు కావాలని ఆదేశించారు.

ఎరువులన్నీ నీటిపాలు

కొత్తపట్నం: ఫెంగల్ తుఫాన్ పోయి వారం రోజులు కావస్తున్నా వర్షాలు తగ్గడం లేదు. వరి, వేరు శనగ, చామదుంప, ఆకుకూరలు, కూరకాయలకు పొలాలకు వేసిన ఎరువులు నీటిపాలవుతున్నాయి. మళ్లీ ఎరువులు వేసుకోవాలంటే ఖర్చు ఎక్కువయ్యే పరిస్థితి నెలకొంటుంది. దోమలు, రసం పీల్చే పురుగులకు మందులు పిచికారీ చేయటం వలన వర్షానికి కిందికి దిగిపోయి బయటకు వదిలి పెట్టే పరిస్థితి ఉందని రైతులంటున్నారు. కొన్ని పైర్లు వర్షానికి మొదుళ్లలో నీరు ఏర్పడి కుళ్లిపోతున్నాయని ఇంకా వర్షం పడితే పంటలు దెబ్బతినే విధంగా ఉంటుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అల్లూరు మెట్ట ప్రాంతంలో ఇప్పుడు కురుస్తున్న వర్షానికి పైర్లు ఆరోగ్యంగా ఉన్నాయని అక్కడ రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. బాగా ఆరిన తరువాత శనగ విత్తనాలు ఎద పెట్టడానికి రైతులు ఎదురు చూస్తున్నారు. తీర ప్రాంతంలో ఇసుక నేలల్లో నీరు నిల్వ చేరి పంటలన్నీ వర్షానికి కొట్టుకుపోయే పరిస్థితి ఉంటుందని ఇంత వరకు వర్షం ఆగితే కొన్ని పంటలన్నా చేతికి వస్తాయని రైతులంటున్నారు.

ట్రాఫిక్ జాం..జాం

- 60 అడుగుల రోడ్డు జంక్షన్‌లో డివైడర్ల ఏర్పాటు
- అక్కడ రోడ్డు దాటాలంటే అద్దంకి బస్టాండ్ వరకు రావాల్సిన పరిస్థితి
- అరవై అడుగుల రోడ్డులోని వైద్యశాలల వద్ద రోగులతో రద్దీ
- డివైడర్ ఏర్పాటు చేయటంతో మార్కెట్‌కు, కోర్టు వైపు వెళ్లేందుకు నానా ఇబ్బందులు
- గతంలో అద్దంకి బస్టాండ్‌లో కూడా రోడ్డు మధ్యలో డివైడర్లు ఏర్పాటు చేసి యూ టర్న్ పెట్టిన పోలీసులు
- ప్రజలను ఇబ్బంది పెట్టడమే ట్రాఫిక్ పోలీసుల లక్ష్యమా?



60 అడుగుల రోడ్డు జంక్షన్‌లో రోడ్డుకు అడ్డంగా డివైడర్లు ఏర్పాటు చేసిన ట్రాఫిక్ పోలీసులు

ఒంగోలు సబర్బన్:

నగరంలో ట్రాఫిక్ అత్యంత దారుణంగా మారింది. వాహనదారులు రోడ్లపైకి రావాలంటే బెంబేలెత్తుతున్నారు. నగరంలోని ప్రధాన రహదారి కర్నూలు రోడ్డును ఆనుకొనే బస్టాండ్ ఉంది. అలాగే 80 శాతం వైద్యశాలలు ఈ రోడ్డుకు ఇరువైపులా ఉన్నాయి. ఇది నిత్యం వాహనాలు.. ప్రజల రాకపోకలతో రద్దీగా మారింది. ఇలాంటి రోడ్డులో నగర ట్రాఫిక్ పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు అసహనానికి గురి చేస్తున్నాయి. కర్నూలు రోడ్డు ప్రధాన సెంటర్‌లోనే 60 అడుగుల రోడ్డు ఉండగా.. దానికి ఎదురుగా ఆర్టీసీ డిపో ఉంటుంది. ఆ తరువాత బస్టాండ్‌కు పడమర వైపు ఉన్న సుందరయ్య భవన్ రోడ్డులో కూడా పదుల కొద్దీ వైద్య శాలలున్నాయి. దీంతో ఈ ప్రాంతాలు ట్రాఫిక్‌తో నరకానికి మారుపేరుగా నిలుస్తున్నాయి.

డివైడర్లతో నానా తిప్పలు

మొన్నటి వరకు 60 అడుగుల రోడ్డు ప్రధాన జంక్షన్‌లో ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేసి ఇటు అద్దంకి బస్టాండ్ వైపు, అటు కర్నూల్ రోడ్డు ఫ్లై ఓవర్ వైపు వాహనాల రాకపోకలు సాగించేవారు. మరోవైపు 60 అడుగల రోడ్డు వైపులోకి, దానికి ఎదురుగా కొత్త కూరగాయల మార్కెట్‌కు, ఇంకా అటు రంగారాయుడు చెరువు వైపు, ఇటు బండ్లమిట్ట, జైరామ్ సెంటర్, జిల్లా కోర్టు ప్రాంగణాలకు వెళ్ళేందుకు సులభంగా ఆ రోడ్డు మార్గం ఉపయోగపడేది. కానీ ప్రస్తుతం అద్దంకి బస్టాండ్ వైపు, కర్నూలు రోడ్డు ఫ్లై ఓవర్ వైపు వన్‌వే ఏర్పాటు చేశారు. దాంతో 60 అడుగుల ప్రధాన జంక్షన్‌లో డివైడర్లు అడ్డంగా పెట్టి మూసేశారు. దీంతో ఈ జంక్షన్ నుంచి నాలుగు వైపులా వెళ్ళే అవకాశం లేక ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు.

గతంలో అద్దంకి బస్టాండ్ దగ్గర

గతంలో నగరంలో పనిచేసిన ట్రాఫిక్ డీఎస్పీ అద్దంకి బస్టాండ్ దగ్గర పాత గుంటూరు రోడ్డులోకి నేరుగా వెళ్ళకుండా ఇదేవిధంగా రోడ్డుకు అడ్డంగా డివైడర్ ఏర్పాటు చేశారు. పాత గుంటూరు రోడ్డులోకి వెళ్ళాలంటే కర్నూలు రోడ్డులో కొంత ముందుకు వచ్చి యూ టర్న్ తీసుకొని మరీ వాహనాలు వెళ్ళాల్సి వచ్చేది. అప్పటి ట్రాఫిక్ నిబంధనలు వల్ల ప్రజలు చాలా అసహనం వ్యక్తం చేశారు. ఆ తరువాత ప్రజల కోరిక మేరకు అప్పట్లో ఏర్పాటు చేసిన డివైడర్‌ను తొలగించి అద్దంకి బస్టాండ్ సెంటర్ నుంచి నేరుగా పాత గుంటూరు రోడ్డులోకి వెళ్ళేందుకు తిరిగి అవకాశం కల్పించారు.



ఆర్టీసీ బస్టాండ్ సెంటర్ గేటుకు ఎదురుగా కర్నూలు రోడ్డు క్రాసింగ్ ఇచ్చిన వైనం

వైద్యశాలలకు వెళ్లలేక అవస్థలు

జిల్లా నలుమూలల నుంచి 60 అడుగుల రోడ్డులోని దాదాపు పదుల సంఖ్యలో ఉన్న వైద్యశాలలకు ప్రజలు నిత్యం వస్తూ పోతుంటారు. సుదూర ప్రాంతాల నుంచి కార్లు, బైకులు, ఆటోలు వేసుకొని వస్తుంటారు. దాంతో పాటు ఎదురుగా ఉన్న ఆర్టీసీ బస్టాండ్‌లో దిగి నడుచుకుంటూ వస్తుంటారు. కానీ ఇక్కడ రోడ్డుకు అడ్డంగా డివైడర్ ఏర్పాటు చేయడంతో బస్టాండ్ ఇన్ గేటు వద్ద నుంచి కర్నూలు రోడ్డులోకి వచ్చి, జంక్షన్ మీదుగా 60 అడుగుల రోడ్డులోకి వెళ్ళాల్సిన పరిస్థితులను ట్రాఫిక్ పోలీసులు కల్పించారు. ఇక కొత్త కూరగాయల మార్కెట్, జైరామ్ సెంటర్ జిల్లా కోర్టు ప్రాంగణానికి వెళ్ళాలంటే ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. దానికి తోడు ఆర్టీసీ బస్టాండ్ సెంటర్ గేటుకు ఎదురుగా కర్నూలు రోడ్డుపై క్రాసింగ్‌ను ఏర్పాటు చేశారు. దానివలన పెద్దగా ఎవరికీ అవసరం ఉండదు. ఈ నిబంధనలతో 60 అడుగుల రోడ్డులో అడ్డంగా ఏర్పాటు చేసిన డివైడర్లను ప్రజలు ఎక్కి దాటుకొని మరీ రోడ్డు అవతలకు వెళుతున్నారు.

నేటి నుంచి రెవెన్యూ సదస్సులు

సంతనూతలపాడు: మండలంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు సంతనూతలపాడు తహసీల్దార్ వేమూరి ఆదిలక్ష్మి వెల్లడించారు. ఈనెల 6వ తేదీ నుంచి జనవరి 7వ తేదీ వరకు జరుగుతాయన్నారు.6న పెర్నమిట్టలో గల గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఉదయం 9 గంటల నుంచి 1 గంట వరకు, మధ్యాహ్నం రెండు గంటల నుంచి ఐదు గంటల వరకు పెర్నమిట్ట ఇందిరానగర్లో రెవెన్యూ సదస్సులు ప్రారంభం కానున్నట్టు తెలిపారు. ఈనెల 7న ఉదయం 9 గంటల నుంచి 1 గంట వరకు పెర్నమిట్ట శాంతినగర్, అదే రోజున మధ్యాహ్నం రెండు నుంచి ఐదు గంటల వరకు పెర్నమిట్టలోని పేర్లమాన్యం, ఈనెల 10న ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు యేండ్లరు గ్రామపంచాయతీలో, 11న మైనంపాడు, 12న ఉదయం 9 నుంచి 1 గంట వరకు గంగవరం, చంద్రపాలెం, మధ్యాహ్నం రెండు నుంచి ఐదు గంటల వరకు బొడ్డువారిపాలెంలో సదస్సులు జరగనున్నట్టు పేర్కొన్నారు. 13న ఉదయం నుంచి సాయంత్రం వరకు కామేపల్లి వారి పాలెం గ్రామపంచాయతీ, 17న సంతనూతలపాడు 1వ సచివాలయం, 18న వేములపాడు పంచాయతీ కార్యాలయం, 19న మట్టి పాడు గ్రామంలోని అంగన్‌వాడీ పాఠశాల, మట్టి పాడు గ్రామాలకు, 20న మద్దూలూరు గ్రామపంచాయతీ, 21న బి మాచవరం గ్రామం, 24న గురువారెడ్డి పాలెం గ్రామపంచాయతీ, 26న ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 1గంట వరకు రుద్రవరం గ్రామ పంచాయతీ, అదేరోజు మధ్యాహ్నం రెండు నుంచి ఐదు గంటల వరకు లక్ష్మీపురం గ్రామపంచాయతీ, 27న ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు పి. గుడిపాడు పంచాయతీ, మధ్యాహ్నం రెండు నుంచి ఐదు గంటల వరకు కొనగాని వారి పాలెం గ్రామపంచాయతీ, 28న గుమ్మలంపాడు, 31న ఎనికపాడు, జనవరి 3న చిలకపాడు, జనవరి 4న పీ తక్కెళ్ళ పాడు, జనవరి 7న ఉదయం మంగమూరు గ్రామపంచాయతీ కార్యాలయంలో రెవెన్యూ సదస్సులు ముగుస్తాయని పేర్కొన్నారు. సర్వే కొలతలు, ఆన్లైన్లో రికార్డులు సవరణలు, భూములు హెచ్చుతగ్గులు తదితర వాటిపై అర్జీలను దాఖలు చేయవచ్చని చెప్పారు.

చీమకుర్తి రూరల్: రైతులు భూ సమస్యలు పరిష్కరిం చుకునేందుకు ఈ నెల 6 నుంచి వచ్చే నెల 8వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ ఆర్. బ్రహ్మయ్య తెలిపారు. గురువారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. భూమి ఆన్ లైన్, పేర్లలో తప్పులు, పొలంలో హెచ్చుతగ్గులు సరిచేసు కోవడం, భూమి రికార్డుల్లో ఉంటే సరిచేసుకోవడం వంటివి పరిష్కరించనున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సదస్సులు ఉంటాయన్నారు. 6వ తేదీ ఇలపావులూరు, 7న పల్లామల్లి, 9 చంద్రపాడు, 10 న దేవరపాలెం, 11న ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిప్పట్లపాడు, అదేరోజు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అయ్యప్ప రాజు పాలెం, 12న చీమకుర్తి, పాటిమీదపాలెం, 16న గోనుగుంట, ముప్వ వారి పాలెం,17న కూనం నేనివారి పాలెం, ఏలూరు వారి పాలెం, 18న చిన రావిపాడు, 19న ఆర్వీ పురం , పుట్ట చెరువు పాలెం, 20 బూదవాడ, 21న రంగ సాయి పురం, 23న నేకునంబాదు , 24న తొర్రగుడి పాడు, 26న బండ్లమూడి, 27న పడమటి నాయుడుపాలెం, 28న కేవీ అగ్రహారం, 30న ఎర్ర గుడి పాడు, 31న మంచికలపాడు, జనవరి 2న ఆర్ఎల్ పురం, 3న మైలవరం, 4న పులికొండ, 6న బూసర పల్లి, 7న జి. ఎల్ పురం, జనవరి 8 పిడతలపూడిలో రెవెన్యూ సదస్సులు జరుగుతాయన్నారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నాగులుప్పలపాడు: మండలంలో శుక్రవారం నుంచి రెవెన్యూ గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఈ గ్రామ సభలు ప్రతి రెవెన్యూ గ్రామంలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. 6వ తేదీ నిడమానూరు, 7 హనుమాపురం, కావూరివారిపాలెం, 9 పోతవరం, 10 నాగులుప్పలపాడు, 11 ఓబన్నపాలెం, 12 మాచవరం, 13 కనపర్తి -1, 16వ తేదీ కనపర్తి -2, 17వ తేదీ కుక్కలవారిపాలెం, చిన్నంగారి పట్టపుపాలెం, 18 అమ్మనబ్రోలు, 19 చీర్వానుప్పలపాడు, అగ్రహారం, 20 చదలవాడ, కేశినేనివారిపాలెం, 21 తిమ్మసముద్రం, 23 ఉప్పుగుండూరు, 24 ఈదుమూడి, 26 మట్టిగుంట, 27 మద్దిరాలపాడు, 28 చేకూరపాడు, 30 ఎం.ముప్పాళ్ళ, 31 కండ్లగుంట, జనవరి 2 ఒమ్మెవరం, 3వ తేదీ కొత్తకోట, 4న కె. తక్కెళ్ళపాడు, 6 రాపర్ల, 7 చవటపాలెంలో సభలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

రేపటి నుంచి రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు



రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల ఏర్పాట్లను పరిశీలిస్తున్న కనిగిరి ఎమ్మెల్యే ఉగ్ర

సంతనూతలపాడు: స్థానిక హైస్కూల్ జరగనున్న సూదనగుంట కోటయ్య చౌదరి, ఆదిలక్ష్మి మెమోరియల్ 71 వ రాష్ట్ర స్థాయి సీనియర్స్ స్త్రీ పురుషుల కబడ్డీ పోటీల ఏర్పాట్లను గురువారం సాయంత్రం కనిగిరి ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి, సూదన గుంట ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ఎన్నారై డాక్టర్ సూదనగుంట రాఘవేంద్ర ప్రసాద్, నిర్వాహకులు ఎస్. కృష్ణమూర్తి, జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు కుర్రా భాస్కరరావు తదితరులు గురువారం పరిశీలించారు. ఈ నెల 7వ తేదీ నుంచి 10వ తేదీ వరకు జరగనున్నట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు కుర్రా భాస్కర్ రావు తెలిపారు. రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలను విజయవంతంగా నిర్వహించేందుకు ముందుకు వచ్చిన ఎన్నారై డాక్టర్ రాఘవేంద్ర ప్రసాద్‌ను కనిగిరి ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, సినీ నటుడు మాజీ ఎంపీ మురళీమోహన్, రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, కలెక్టర్ తమీమ్ అన్సారియా, సంతనూతలపాడు శాసన సభ్యుడు బీఎన్ విజయకుమార్ తదితరులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. అలాగే ఎంపీలు తేనేటి కృష్ణ ప్రసాద్, మాగుంట శ్రీనివాసులరెడ్డి, కనిగిరి ..గిద్దలూరు శాసనసభ్యులు ఉగ్ర నరసింహారెడ్డి, ముత్తుముల అశోక్ రెడ్డి తదితరులు రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు విచ్చేస్తున్నట్లు డాక్టర్ రాఘవేంద్ర ప్రసాద్ పేర్కొన్నారు. సూదన కుంట కృష్ణమూర్తి, కుర్రా భాస్కరరావు, ఎన్. చంద్రమోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

సంతనూతలపాడు: బస్టాండ్ సెంటర్‌లో గురువారం సాయంత్రం సంతనూతలపాడు సబ్ ఇన్‌స్పెక్టర్ వేజెండ్ల అజయ్ బాబు, పోలీసు సిబ్బంది ఆధ్వర్యంలో లైసెన్స్ లేని వాహనాలపై ముమ్మర తనిఖీలను నిర్వహించారు. డ్రంక్ అండ్ డ్రైవ్, హెల్మెట్ ధరించని వాహనాలు, లైసెన్సులు లేని వాహనాలు, వాహనదారులపై అజయ్ బాబు తనిఖీలు నిర్వహించారు. లైసెన్సులు కలిగి ఉండి హెల్మెట్ ధరించాలని లేదంటే.. కేసులు నమోదు చేయనున్నట్లు ఎస్ఐ అజయ్ బాబు హెచ్చరించారు

ఉత్సాహంగా కళా ఉత్సవ పోటీలు

ఒంగోలు సిటీ: డైరెక్టర్ పాఠశాల విద్య వారి ఉత్తర్వులు మేరకు జిల్లా స్థాయి కళా ఉత్సవ్ 2024-25 పోటీలు ప్రభుత్వ జిల్లా విద్యా శిక్షణ సంస్థ మైనంపాడు ప్రిన్సిపాల్ ఎస్.సుబ్బారావు ఆధ్వర్యంలో గురువారం ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. మైనంపాడు డైట్ ప్రిన్సిపాల్ సుబ్బారావు మాట్లాడుతూ ఈ పోటీలు ఆరు కళారూపాల్లో జరుగుతాయని తెలిపారు. గాత్ర సంగీతం, వాద్య సంగీతం, నాట్యం, నాటక కళ, దృశ్య కళలు, సంప్రదాయ కథావిన్యాసం వంటి అంశాల్లో పోటీలు నిర్వహించారని తెలిపారు. పోటీలకు ఎం .మురళీకృష్ణ, ఎం.మల్లిఖార్జున, సీహెచ్.మాధవీలత, న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు.

అక్రమ లే అవుట్‌లపై చర్యలు



మాట్లాడుతున్న జేసీ

ఒంగోలు అర్బన్: ఒంగోలు పట్టణ అభివృద్ధి సంస్థ (ఒడా) పరిధిలోని అక్రమ లే అవుట్లను గుర్తించి చర్యలు తీసుకుంటామని జిల్లా జాయింట్ కలెక్టర్ ఒడా ఉపాధ్యక్షుడు రోణంకి గోపాలకృష్ణ పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణకు తెలిపారు. గురువారం మంత్రి నిర్వహించిన మీడియో సమావేశంలో జాయింట్ కలెక్టర్ ప్రకాశం భవనం నుంచి మాట్లాడారు. ఈ సందర్భంగా ఒడా పరిధిలోని అంశాలను చర్చించారు. ఒడా పరిధిలో ప్రతి నియోజకవర్గంలో ఎన్‌టీఆర్ స్మార్ట్ టౌన్‌షిప్‌లు ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. త్వరితగతిన భవన అనుమతులు, లే అవుట్ల అనుమతులు పూర్తి చేస్తామని తెలిపారు. మున్సిపల్ అధికారులు, ఒడా అధికారులు పాల్గొన్నారు.

అయ్యప్పకు పవిత్ర హోమాలు

ఒంగోలు మెట్రో: స్థానిక ముంగమూరు డొంక అయ్యప్ప స్వామి క్షేత్రంలో వార్షిక పవిత్రోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. గురువారం ఉదయం విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, పవిత్ర అవరోహణం జరిగింది. నంతరం అయ్యప్పకు పడిపూజ వైభవంగా పడిపూజ నిర్వహించారు.



గుండ్లాపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న ఏఓ రమేష్

ఘనంగా ప్రపంచ నేల దినోత్సవం



మాట్లాడుతున్న వ్యవసాయ విస్తరణాధికారి కేవీ సుబ్బారెడ్డి

సంతనూతలపాడు: స్థానిక రైతు సేవ కేంద్రంలో ప్రపంచ నేల దినోత్సవం, భూసార ప్రాముఖ్యతపై రైతులకు గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సంతనూతలపాడు వ్యవసాయ విస్తరణ అధికారి ఎస్.వెంకటరావు మాట్లాడుతూ డిసెంబర్ 5న ప్రపంచ నేల దినోత్సవంగా ప్రపంచం మొత్తం నిర్వహిస్తున్నామని తెలిపారు. భూసారం పెంపొందించడానికి జనుము, జీలుగ, పిల్లి పెసర కలియ దున్నుకోవాలని, భూసార పరీక్ష ఫలితాలు ఆధారంగా మాత్రమే ఎరువులను వాడాలని తెలిపారు. అధిక మోతాదులో రసాయన ఎరువులు, పురుగు మందులు వాడకం వలన భూమి నిస్సారమైపోతుందని, పంటలు సరిగా పండవని హెచ్చరించారు. రసాయనిక ఎరువులు వాడటం వల్ల వాతావరణం కూడా కాలుష్యం అవుతుందని తెలిపారు. అనంతరం రైతులకు భూసార పరీక్ష ఫలితాల పత్రాలు (సాయిల్ హెల్త్ కార్డ్స్) అందజేశారు. వ్యవసాయ విస్తరణ అధికారి కేవీ సుబ్బారెడ్డి, సంతనూతలపాడు గ్రామ వ్యవసాయ సహాయకులు ఇ.దుర్గా ప్రసాద్, మన్నం రామారావు, చెరుకూరి యలమందయ్య, కాజా కోటిరెడ్డి రైతులు పాల్గొన్నారు.

నేలను పరిరక్షించాలి

మద్దిపాడు: మండలంలోని గుండ్లపల్లి గ్రామంలో వరల్డ్ సాయిల్ డే సందర్భంగా వ్యవసాయ శాఖ అధికారి కె. రమేష్ స్థానిక స్కూల్ విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ నేల సమతుల్యంగా ఉండాలని నేలలో ఉండే పోషకాలను కాపాడుకుంటూ పరిరక్షించుకోవాలని అన్నారు. విచక్షణారహితంగా రసాయన ఎరువుల వాడకం వలన భూమి చౌడుగా మారుతుందని రైతులు భూసార పరీక్షలు చేయించుకుని తగిన ఎరువులు వాడి భూమి సమతుల్యత కాపాడుకోవాలని తెలిపారు. అనంతరం మండలంలోని అన్నంగి, గుండ్లపల్లి గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించి రైతులకు పంటల బీమా గురించి వివరించారు. మినుము శనగ.. మొక్కజొన్న వేసిన రైతులు డిసెంబర్ 15వ తేదీలోగా పంట నమోదు చేసుకోవాలని వరి పంట వేసిన రైతులు డిసెంబర్ 31వ తేదీలోగా నమోదు చేయించుకోవాలని తెలియజేశారు. పలువురు గ్రామ రైతులు విద్యార్థులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల ప్రత్యేక సమావేశాలు రేపు



మాట్లాడుతున్న ఎంఈఓ నరసింహారావు, ఎంపీడీవో రాఘవేంద్ర

చీమకుర్తి రూరల్: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల తల్లిదండ్రులతో శుక్రవారం ప్రత్యేక సమావేశాలు నిర్వహించాలని చీమకుర్తి ఎంపీడీవో రాఘవేంద్ర తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల, హైస్కూల్ హెచ్ఎంలు, కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. విద్యార్థుల అభ్యున్నతి కోసం తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించాలని తెలిపారు. విద్యార్థుల ప్రోగ్రెస్, సహపంక్తి భోజనాలు, పలు పోటీలు, తదితర కార్యక్రమాలను పాఠశాల స్థాయిలో నిర్వహించాలన్నారు. ఎంఈఓ ఎంబీఎల్ నరసింహారావు, హెచ్ఎంలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

యువత భవిష్యత్‌పై భరోసా లేదు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సంకల్ప్

ఒంగోలు టౌన్: దేశంలోని యువతరం భవిష్యత్తుపై భరోసా కోల్పోయారని, దేశంతోపాటు ప్రపంచ ప్రజలంతా అభద్రతాభావంతో జీవిస్తున్నారని భారత యాత్రికుడు సంకల్ప్ అన్నారు. నాగపూర్‌కు చెందిన సంకల్ప్ గత రెండు నెలల నుంచి టాటా నానో కారులో దేశమంతా పర్యటిస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం అంబేడ్కర్ భవనంలో విలేకరులతో మాట్లాడారు. పర్యావరణాన్ని ధ్వంసం చేయడం వలన ప్రకృతి విలయాలు సంభవిస్తున్నాయని, ప్రజలు, ప్రభుత్వాలు పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రతిన బూనాలని పిలుపునిచ్చారు. మానసిక ఉద్రేకాల వల్లనే మానవునిలో అశాంతికి, దుఃఖానికి కారణం అవుతున్నాయని చెప్పారు. ధ్యాన సాధన ద్వారా శాంతి సామరస్యాలు అలవడతాయని చెప్పారు. 2600 సంవత్సరాల క్రితం గౌతమ బుద్ధుడు బోధించిన వపశ్యన, ధ్యానం, పంచశీల సూత్రాలు కుల మతాలకతీతంగా అందరికీ ఆచరణీయమని అన్నారు. దేశంలో అంబేద్కర్ బౌద్ధానికి జీవం పోస్తే , ఆచార్య సత్యనారాయణ గోయంకా విశ్వవ్యాప్తం చేశారని తెలిపారు. కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యకళాశాల ప్రొఫెసర్ సుధాకర్, బుద్ధిస్ట్ ఎ. లక్ష్మి ప్రసాద్, బి. శ్యాం, శరత్ కుమార్, అలీ, జి. నాగేశ్వరరావు పాల్గొన్నారు.

తూతూ మంత్రంగా రేషన్ షాపు తనిఖీ



రేషన్ షాపులో తనిఖీ చేస్తున్న ఫుడ్ ఇన్‌స్పెక్టర్

ఒంగోలు అర్బన్: స్థానిక బిలాల్ నగర్‌లోని రేషన్ షాపును గురువారం సివిల్ సప్లయిస్ అధికారులు తూతూ మంత్రంగా తనిఖీ చేశారు. అయితే ఫుడ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు ఒక్కరే తనిఖీ నిర్వహించడం..ఆ సమయంలో టీడీపీకి చెందిన చోటా నాయకులు రావడం జరిగిపోయాయి. దీంతో తనిఖీలను పూర్తి చేయకుండానే ఫుడ్ఇన్‌స్పెక్టర్ రేషన్ షాపుకు తాళం వేసుకుని రేపు ఉదయం వచ్చి తనిఖీ చేసి తగిన చర్యలు తీసుకుంటామంటూ వెనుతిరిగారు. ఆయన్ను వివరణ అడుగగా రేపు ఉదయం పది గంటలకు మాత్రమే వివరాలను తెలుపుతామని దాటవేశారు. డీఎస్ఓ సైతం ఫోన్‌కు స్పందించకపోవడం గమనార్హం.

3 వేల బస్తాల రేషన్ బియ్యం సీజ్

నాగులుప్పలపాడు: రేషన్ బియ్యం దందాకు కూటమి ప్రభుత్వం పెద్ద ఎత్తున పాల్పడుతోంది. ఒకవైపు సీఎం, డిప్యూటీ సీఎం వంటి వారు పైకి నీతులు చెబుతూనే.. కిందిస్థాయిలో మాత్రం తమ నేతలకు రేషన్ బియ్యం ద్వారా అక్రమార్జనకు అవకాశం ఇస్తున్నారు. ఉప్పుగుండూరులో గురువారం అర్ధరాత్రి జరిగిన సంఘటనే అందుకు నిదర్శనంగా ఉంది. గ్రామంలోని మణికంఠ రైస్‌మిల్ అడ్డాగా టీడీపీ నేతలు అక్రమంగా నిల్వ ఉంచిన 3 వేల బస్తాల రేషన్ బియ్యాన్ని ఆర్డీవో లక్ష్మీప్రసన్న, తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, తమ సిబ్బందితో దాడి చేసి స్వాధీనం చేసుకున్నారు. సీజ్ చేసిన బియ్యంలో ఎంతమేరకు లెక్కచూపించాలనే దానిపై టీడీపీ నేతల ఒత్తిళ్లతో ఆర్డీవో తర్జనభర్జన పడుతున్నట్లు తెలుస్తోంది.

నేడు అంబేడ్కర్ వర్ధంతి కార్యక్రమాలు

ఒంగోలు వన్‌టౌన్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 68వ వర్ధంతి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ యస్. లక్ష్మా నాయక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒంగోలు హెచ్‌సీఎం కళాశాల ఎదురుగా ఉన్న విగ్రహానికి నివాళులర్పిస్తామన్నారు. అనంతరం కలెక్టరేట్ ఎదురుగా ఉన్న విగ్రహం వద్ద నివాళులర్పిస్తానమి తెలిపారు. కార్యక్రమంలో కలెక్టర్ తమీమ్ అన్సారియా ముఖ్య అతిథిగా పాల్గొంటారన్నారు.

చీమకుర్తి రూరల్: భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 68వ వర్ధంతి సందర్భంగా స్థానికంగా ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలతో నివాళులర్పించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పమిడి వెంకటేశ్వర్లు గురువారం తెలిపారు. పార్టీ ప్రకాశం జిల్లా అధ్యక్షుడు, దర్శి శాసనసభ్యుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి, చైర్ పర్సన్ శ్రీమతి బూచేపల్లి వెంకాయమ్మ పాల్గొంటారని తెలిపారు. ప్రజా ప్రతినిధులు, అభిమానులు, కార్యకర్తలు తప్పక హాజరు కావాలని పిలుపునిచ్చారు.

మద్దిపాడు: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 68వ వర్ధంతి సందర్భంగా మద్దిపాడులో ఉదయం 9 గంటలకు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలతో నివాళులర్పించనున్నారు. మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, అభిమానులు, కార్యకర్తలు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల అధ్యక్షుడు మండవ అప్పారావు కోరారు.